# తెలియని అనుభూతి

శిరీష ఒంటరిగా కూచుని కేబుల్ టి.వి.లో సినిమా చూస్తోంది. ఆదివారం ఆమె తల్లితండ్రులిద్దరికీ కూడా వర్కింగ్‌డే.

సినిమాలో హీరోయిన్‌పై విలన్ అత్యాచార ప్రయత్నం చేస్తున్నాడు. ఆమె తప్పించుకునే ప్రయత్నం చేస్తూ అరుస్తోంది. ఆ అరుపులు విన్న హీరో దూసుకువచ్చాడు. హీరో, విలన్ల పోరాటం సాగుతోంది. తన ప్రియుడి వీరకృత్యాలకు ఆనందిస్తూ 'అతడంతటి వీరుడా' అని ఆశ్చర్యపోతూ, తనకు మానభంగం జరగనందుకు సంతోషిస్తూ హీరోయిన్ పోరాటాన్ని చూస్తోంది. హీరో విలన్ చేతిలోని పిస్తోలుని ఎడం కాలితో ఎగిరి తన్నేడు...

కాలింగ్‌బెల్ మోగిన శబ్దానికి విసుక్కుంటూ లేచి తలుపు తీసింది శిరీష. ఎదురుగా ధీరజ్.

"నువ్వా? ఎందుకు వచ్చావు?"

"నన్ను ఎందుకు మోసం చేశావో తెలుసుకుందుకు"

"నేను నిన్ను మోసం చేశానా? ఎప్పుడు? ఎక్కడ?".

"నన్ను ప్రేమించి, మోసం చేసి, ఇప్పుడు అజయ్‌తో తిరగడం లేదూ"

ధీరజ్ లోపలకు వచ్చి తలుపు వేశాడు.

"నేను నిన్ను మోసం చేశానా? ప్రేమించానని చెప్పానా?"

"ప్రేమించకుండానే నాతో తిరిగావా? రోజూ నా వెనుక మోటార్ సైకిల్‌మీద కూచుని సినిమాలకి, హోటళ్ళకీ రాలేదా? నీకోసం ఎంత డబ్బు ఖర్చు పెట్టాను? ఇదంతా ప్రేమ లేకుండానే చేశాననుకుంటున్నావా? ప్రేమ లేకుండానే నాతో వచ్చావా?"

"ధీరజ్! స్నేహం వేరు, ప్రేమ వేరు. నేను నీతో స్నేహంగా ఉన్నాను. కమలతో తిరగడమెంతో నీతో తిరగడమూ అంతే"

"రెండూ ఒక్కటే ఎలా అవుతాయి? నేను ఖర్చు పెట్టినంత డబ్బు కమల నీకోసం ఖర్చు పెట్టిందా? నాకు నీ మీద ప్రేమ ఉంది కాబట్టి ఖర్చు పెట్టాను."

"ధీరజ్ డబ్బుతో ప్రేమను కొనుక్కోలేవు"

"అజయ్ దేనితో కొంటున్నాడు?"

శిరీష మాట్లాడలేదు.

"నేను కూడా నిన్ను ప్రేమించాను. ప్రేమించాను కాబట్టే డబ్బు నీకోసం ఖర్చు పెట్టాను. నువ్విలా ప్లేటు ఫిరాయిస్తావని నాకు తెలియదు"

"నేను నిన్ను ప్రేమించానని చెప్పలేదు. ప్లేటు ఫిరాయించలేదు"

"ఇప్పుడేం చెయ్యాలి!?"

"మనం స్నేహితులుగానే ఉందాం"

"స్నేహమా? నీలాంటి కర్కోటకురాలితోటా? అసంభవం"

"అయితే వెళ్ళిపో"

"వెడతాను. అయితే నాకు దక్కని అందాన్ని వదిలేసి మాత్రం వెళ్ళను. నిన్ను నా సొంతం చేసుకునే వెడతాను."

ధీరజ్ ఆమె మీదకు వంగాడు. శిరీష వెనక్కి జరిగింది. అతను ఆమె చెయ్యి పట్టుకోబోయాడు. ఆమె పరిగెత్తింది. "ఎలా పారిపోతావో చూస్తాను" అంటూ వీధి తలుపు వేసి ఆమె వెనుక పరిగెత్తాడు. శిరీష మెదడులో మెరుపు మెరిసింది. ఆమె తొందరగా వెనక తలుపు తీసుకుని, బయటకు వెళ్ళి గడియ వేసేసింది. ధీరజ్‌కి వెనక తలుపుకి బయట గడియ వేసి ఉందని తెలిసేలోగా ఆమె ఇంటి చుట్టూ తిరిగి, వీధి గేటు దగ్గరకు వచ్చి "హమ్మయ్యా" అని నిట్టూర్చింది.

ఈలోగా ధీరజ్ వీధి గుమ్మం తలుపు తీసుకుని, గేటు దగ్గరకు పరిగెత్తుకుని వచ్చాడు. శిరీష "రక్షించండి" అని అరుస్తూ గేటు తీసుకుని వీధిలోకి పరిగెత్తింది. "నాకు దక్కకుండా ఎలా పోతావో చూస్తాను" అంటూ అరుస్తూ ధీరజ్ ఆమె వెనక పరిగెత్తి పట్టుకున్నాడు.

❖ ❖ ❖

శిరీష అరుపులూ, ధీరజ్ కేకలూ అందరికీ వినిపించాయి. శిరీష ఇంటి ఎదురుగా ఉన్న అపార్ట్‌మెంట్స్‌లో అందరూ బాల్కనీలలోకి వచ్చి నిలబడ్డారు.

ధీరజ్ శిరీష చీర లాగేసే ప్రయత్నంలో ఉన్నాడు. ఆమె అతని చేతుల్లో నుంచి తప్పకుందుకు పెనుగులాడుతోంది.

అందరూ ఎవరి బాల్కనీలలో వాళ్ళు నిలబడి చూస్తున్నారు. ఎవరూ కదలడం లేదు. అప్పుడే భర్తను భోజనానికి పిలవడానికి వచ్చిన సరస్వతి మాత్రం "అలా నిలబడ్డారేమిటి? పోలీసులకి ఫోన్ చెయ్యండి" అంటూ భర్తను లోపలకు తీసికెళ్ళింది.

జగన్నాధం పోలీసులకి ఫోన్ చెయ్యలేదు. తన ఫ్రెండ్ విశ్వనాధ్‌కి ఫోన్ చేసి, విషయం చెప్పి పోలీసులకి ఫోన్ చెయ్యొచ్చా అని అడిగాడు.

విశ్వనాథ్ వెంటనే చెయ్యమని సలహా ఇచ్చాడు. రోడ్డుమీద ధీరజ్ శిరీషను లొంగదీసుకునే ప్రయత్నాలు సఫలం కాలేదు. అతడు ఆవేశంగా శిరీషను నాలుగైదు చోట్ల పొడిచి పారిపోయాడు.

బాల్కనీలలో అందరూ కళ్ళు మూసుకున్నారు.

జగన్నాథం చేసిన ఫోను వార్త విన్న తర్వాత వచ్చిన పోలీసులకు శిరీష శవం కన్పించింది.

వాళ్ళు ధీరజ్‌ని వెతికే ప్రయత్నంలో పడ్డారు.

❖ ❖ ❖

నాలుగు రోజుల తర్వాత ఊరునుంచి వచ్చిన రవీంద్రగారు కొడుకు విశ్వనాధ్‌తో "ఏమిటి విశేషాలు" అన్నారు.

"నడిరోడ్డుమీద పట్టపగలు అమ్మాయిని హత్య చేస్తుంటే అందరూ చూస్తూ నిల్చున్నారు"

"ఇందులో విశేషమేముంది?" రోజూ పేపర్లలో చదువుతూనే వున్నాంగా. పోలీసు స్టేషన్ల పక్కనే జరుగుతున్నా ఎవరూ పట్టించుకోరు. కనీసం పోలీసులకి ఫోనైనా చెయ్యరు."

"కానీ హత్య చెయ్యబడ్డ అమ్మాయి శిరీష. అదే విశేషం."

"శిరీషా? శిరీషంటే మనం ఇదివరకున్న అపార్ట్‌మెంట్స్ ముందింట్లో ఉండే అమ్మాయి కదూ"

"అవును. శిరీషను ప్రేమించిన అబ్బాయి ఆమె తనను మోసం చేసిందన్న కోపంతో నడిరోడ్డు మీద చంపేశాడు. అందరూ చూస్తూ నిల్చున్నారు. హత్య జరిగే ముందు జగన్నాథం నాకు ఫోను చేసి పోలీసులకు ఫోను చెయ్యనా అన్నాడు, వెంటనే ఫోను చెయ్యమన్నాను. నాకు వివరాలు పూర్తిగా తెలియవు, లేకపోతే నేను చేద్దును."

"లోకం ఎలా మారిపోతోంది? అమ్మాయిలు అబ్బాయిలతో సమం అంటున్నారు. సమంగా అన్ని హక్కులూ ఇస్తున్నామంటున్నారు. స్త్రీకి సంఘంలో గౌరవం పెరిగిందంటున్నారు. పూర్వం స్త్రీ గతి అధోగతే అంటున్నారు. కానీ మా చిన్నప్పుడు ఆడదాని పై అత్యాచారం జరగబోతూంటే ఊరుకునే వాళ్లమా? నలుగురం కర్రలు పట్టుకుని ఆ మగాణ్ణి చావగొట్టే వాళ్లం కాదా? పట్టణాలలో ఒకరి నొకరు తెలియక పోవడం మూలాన పట్టించుకోడం లేదేమో."

"కానీ శిరీష అందరికీ తెలిసిన పిల్ల" అన్నాడు విశ్వనాథ్.

"ఆ మాటా నిజమే" అన్నారు రవీంద్రగారు.

❖ ❖ ❖

మర్నాడు రవీంద్రగారు, విశ్వనాథ్ శిరీష తల్లిదండ్రులని పలకరించడానికి వెళ్ళారు. ఇల్లు తాళం వేసి ఉంది.

"ఏముంది పోలీసులు ఇంటరాగేషన్‌కి పిల్చి ఉంటారు" అన్నాడు విశ్వనాథ్

ఇద్దరూ ఎదురుగుండా ఉన్న అపార్ట్‌మెంట్స్‌లోకి వెళ్ళారు.

అపార్ట్‌మెంట్ అసోసియేషన్ మీటింగ్ జరుగుతోంది. బోర్‌వెల్‌లో నీళ్ళు సరిగా రావడం లేదు. ఇంకో బోర్‌వెల్ వేయించాలా లేక ట్యాంకర్లతో నీళ్ళు కొనాలా అన్న విషయం మీద చర్చ జరుగుతోంది.

నీళ్ళకి సంబంధించిన విషయం కాబట్టి అపార్ట్‌మెంట్స్‌లో అందరూ మీటింగుకి వచ్చారు. అందరూ రవీంద్రగారినీ, విశ్వనాథ్‌నీ పలకరించారు.

"శిరీష తల్లితండ్రుల్ని పలకరించిపోదామని వచ్చాం. ఇల్లు తాళం వేసి ఉంది. పరామర్శ చెయ్యలేదు కనుక ఇక్కడకు రావచ్చనుకుంటాను" అన్నారు రవీంద్రగారు.

అందరి మొహాలూ మ్లానమయ్యాయి. శిరీషను తామే చంపామేమోనన్న అనుమానం అందరి ముఖాల్లోనూ కన్పించింది.

ముందుగా తేరుకున్న కోమలి "మీరు మా ఇంటికి ఎప్పుడైనా రావచ్చును బాబాయిగారూ. ఇది మీ ఇల్లే అనుకోండి" అంది.

"శిరీష మీ పిల్లే అని మీరెవరూ అనుకోలేకపోయారా?" ఎవరూ మాట్లాడలేదు.

"అసలేమయింది?" అడిగారు రవీంద్రగారు.

"శిరీష ముందుగా ధీరజ్‌తో స్నేహంగా తిరిగేది. ఆ తరువాత అజయ్‌ని ప్రేమించానని అతనితో తిరిగేది. దానివల్ల ధీరజ్‌కి కోపం వచ్చింది. తనను చాలామంది ప్రేమించాలనీ, తన కోసం కొట్లాడుకోవాలనీ, అందులో బెస్ట్ వాడిని పెళ్ళాడాలనీ ఆమె అనుకునేది. తన కోసం చాలామంది మగవాళ్ళు ఎదురు చూడ్డం ఆమెకు థ్రిల్లింగ్‌గా ఉండేది. ఆ థ్రిల్లే ఆమె ప్రాణాలూ తీసింది" అందొకమ్మాయి.

"ఆ థ్రిల్ మాత్రమే ఆమె ప్రాణాలు తీసిందా? మీరు కారణం కాదా?"

అందరూ తలవంచుకున్నారు.

"హత్య జరుగుతుందని మీరు ఊహించలేదు సరే. కానీ అత్యాచార ప్రయత్నాన్ని ఆపారా? మీరు పదిమంది కలిసి ఒక్కణ్ణి ఆపలేరా?"

ఎవరూ మాట్లాడలేదు.

"రొమాన్స్, వయొలెన్స్ ప్రభావం యువతరం మీద ఎంత ఉందో తెలుస్తోంది. రొమాన్స్ ఊహించుకుని శిరీష చనిపోయింది. వయొలెన్స్ ప్రభావంలో ధీరజ్ జైలు పాలయ్యాడు. కానీ మీరందరూ ఏం చేస్తున్నారు? ఎందుకు ధీరజ్‌ని ఆపలేదు?"

రవీంద్రగారు ఇంకా మాట్లాడారు.

"మా తరానికున్న బలం మీకు లేదు. పదిమంది కలిసి కూడా ఒకణ్ణి ఆపలేరు. కానీ పోలీసులకి ఫోను చెయ్యొచ్చునే? ఇంట్లో నుంచి చేస్తే కాల్ ట్రేస్ అవుతుందన్న భయముంటే దగ్గర్లో ఉన్న పబ్లిక్ బూత్‌కి వెనక సందులోనుంచి వెళ్ళి ఫోన్ చెయ్యొచ్చునే. ఎవరేమైతే మనకేమిటన్న నిర్లక్ష్యమా? మనం బాగుంటే చాలునన్న స్వార్థమా?".

రవీంద్రంగారంటే అందరికీ గౌరవముంది. తాము తప్పు చేశామన్న భావమూ ఉంది. అందుకే ఎవరూ ఆయన మాటలను ఆపలేదు.

"మా చిన్న తనంలో అన్యాయం జరుగుతుంటే ప్రాణాలకు తెగించి ఆపేవాళ్ళం. మీరు సినిమా చూస్తున్నట్లుగా ఎలా నిల్చుండిపోయారు?"

రవీంద్రగారు మాటలాపిన రెండు నిముషాలకు అసోసియేషన్ ప్రెసిడెంటు మాట్లాడాడు.

"మీ ప్రశ్నలోనే సమాధానముందనుకుంటాను రవీంద్రగారూ. నాకు ఆలోచిస్తూంటే ఇప్పుడు కారణం తోస్తున్నది. మేము ఆగిపోడానికి కారణం భయం కాదు. ఫోన్ చెయ్యకపోడానికి కారణం నిర్లక్ష్యం కాదు. మేము చూస్న దృశ్యం మాకు కొత్తగా కన్పించలేదు. నిత్యం సినిమాలలో హింసను చూసి, చూసి మా మెదడులు మొద్దుబారిపోయాయి. ఎదురుగా జరుగుతున్నది ఒక డ్రామాలా అన్పించింది. కానీ వాస్తవమనిపించలేదు. మేము కాలక్షేపానికి చూసేవాళ్ళమే కానీ జగన్నాటకంలో పాత్రధారులమనుకోలేదు."

అసోసియేషన్ సెక్రటరీ అందుకుని "అంతేకాదు రవీంద్రగారూ శిరీషను ధీరజ్ మానభంగం చేసే ప్రయత్నం చేస్తూంటే ఎవరో హీరో వచ్చి రక్షిస్తాడనుకున్నామేమో. అందుకే కదలలేకపోయామేమో" అన్నాడు.

రవీంద్రగారికి కళ్ళు తిరిగినట్లనిపించింది.

(వార్త)